క్లుప్తంగా

ఏకాగ్రతతో చదవాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారెడ్డి

సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్: విద్యార్థులు ఉన్నతస్థాయి చేరేదాకా ఏకాగ్రతతో చదవాలని సీఐ సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం షీటీం, చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని సీఐ అవగాహన కల్పించారు. యువత ఎక్కువగా సెల్‌ఫోన్, చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారని, చిన్న వయస్సులోనే మద్యం, గంజాయి, సిగరెట్లు తాగడం అలవాటు చేసుకొని జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అమ్మాయిలు అత్యవసర సమయంలో షీటీం, డయల్ 100కు, లేదా నేరుగా పోలీసుస్టేషన్‌లో అయినా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. ఎస్సై శ్రావణ్‌కుమార్, ప్రిన్సిపాల్ మెహరాజ్, ఉన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి

జూలపల్లి: రైతులు తమ వ్యవసాయ భూముల్లోని మట్టి నమునాలను భూసార పరీక్షలు చేయించాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. మండల కేంద్రంలో సోమవారం రైతుల వ్యవసాయ క్షేత్రాల నుంచి భూసార పరీక్షలకు మట్టి నమునాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పెంచుకోవచ్చని, దీంతో రైతులకు లాభాలు వస్తాయని తెలిపారు. ప్రతి గ్రామంలో 5 ఎకరాలకు ఒక మట్టి నమునా సేకరిస్తామని, మండలంలో 4088 మట్టి నమునాలను సేకరించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఏఈవో రాకేశ్, రైతులు గడ్డం రాంరెడ్డి, కల్లెం దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు పాఠశాలలు బంద్

పెద్దపల్లిరూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ పాటిస్తున్నామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్నాయని, యాజమాన్యాలే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం దుస్తులు అమ్ముతూ అక్రమార్జనకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పాఠశాలల యజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు బంద్‌కు సహకరించాలని కోరారు.

తైబజారు వేలం పూర్తి

జూలపల్లి: మండలంలోని కాచాపూర్, కుమ్మరికుంట గ్రామాల్లో ప్రతివారం నిర్వహించే వారసంత తైబజారు వేలం మండల పంచాయతీ అధికారి కిరణ్ ఆధ్వర్యంలో సోమవారం పూర్తయింది. స్థానిక గ్రామపంచాయతీల్లో నిర్వహించిన వేలంలో కాచాపూర్‌లో రూ.11,200 ఆదాయం రాగా, కుమ్మరికుంటలో రూ.12వేల ఆదాయం సమకూరింది. తైబజారు వసూలుకు 2024 జూలై 1 నుంచి 2025 మార్చి 31 వరకు 9 నెలల గడువు ఇచ్చారు. కుమ్మరికుంట పంచాయతీ ప్రత్యేకాధికారి అజారుద్దీన్, కార్యదర్శులు శరత్, అంజలీధర్, కారోబార్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన ఉండాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మహిళలు కనీస అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారిత కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం మహిళలకు అవగాహ కల్పించారు. పల్లె ప్రాంతాల్లోని మహిళలకు బేటీపడావో.. బేటీ బచావో, బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, బాలికలపై వివక్ష, లింగనిర్ధారణ చట్టం, సఖి సేవలపై వివరించారు.జెండర్ స్పెషలిస్టు సుచరిత, స్వప్న ఉన్నారు.

ఆలయ భూమిని కాపాడండి

మంథని: మంథని–పెద్దపల్లి రహదారిలోని పోచమ్మ గుడి మాన్యానికి సంబంధించి బొక్కల వాగును ఆనుకొని ఉన్న భూమిని కొంత కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని మంథని మత్స్యశాఖ అధ్యక్షుడు పోతరవేని క్రాంతికుమార్ అన్నారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని బోయిన్‌పేట, తెనుగుగూడెం, గొల్లగూడెం, దుబ్బగూడెం, గంగాపురి ప్రజలు ఆరాధ్యదైవంగా భావిస్తూ ఏ శుభకార్యమైనా మొదట దర్శనం చేసుకుంటారని తెలిపారు. పోచమ్మ కొలువుతో పాటు వనభోజనాలకు ఉపయోగించుకునే స్థలాన్ని కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారన్నారు. కబ్జాను కట్టడి చేయాలని కోరారు.

ప్రధానోపాధ్యాయుల బాధ్యత నుంచి తప్పించాలి

ధర్మారం: బీఈడీతో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న తమకు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా కొనసాగే అర్హత లేనందున తమను ప్రధానోపాధ్యాయుల బాధ్యత నుంచి తొలగించాలని సోమవారం బీఈడీ టీచర్లు మండల విద్యాధికారికి వినతిపత్రం అందించారు. మండలంలోని 11 ప్రాథమిక పాఠశాలల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు జలపతి, లక్ష్మీనారాయణ, సురేశ్, సంజీవ్, వెంకటరమణారెడ్డి, రామన్, వంశీ, సుజాత, భాగ్యలక్ష్మి, పద్మజ, వనజ పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, జెడ్పీటీసీ చెలుకల స్వర్ణలత
- వాడీవేడిగా ముత్తారం మండల సర్వసభ్య సమావేశం



సభలో వాదనలు చేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ, ఫారెస్ట్ అధికారి

ముత్తారం: గ్రామాల్లో అధికారులు పారదర్శకంగా పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, జెడ్పీటీసీ చెలుకల స్వర్ణలతఅశోక్ అన్నారు. ముత్తారంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌కో ఏఈ హనుమాదాస్‌నాయక్ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టిస్తే అటవీశాఖ అధికారులు రూ.12,500 జరిమానా వేశారని ఆరోపించారు. అటవీశాఖ బేగంపేట సెక్షన్ అధికారి నర్సయ్య మాట్లాడుతూ తాము పెట్టిన మొక్కలను నరికిస్తే ఊరుకోమన్నారు. చెట్లు ముందా.. కరెంట్ లైన్ ముందా అని కాసేపు ఇరువురి ఆరోపణలతో సభ గందరగోళంగా మారింది. ఎంపీపీ జోక్యం చేసుకొని ఆర్‌అండ్‌బీ రోడ్డు నిబంధనలను పాటిస్తే ఈ సమస్య ఉండదని వివరించడంతో వాదనలు సద్దుమణిగాయి.

సభ్యులు ప్రస్తావించిన సమస్యలు..

మండలంలోని ఓడేడ్, అడవిశ్రీరాంపూర్, ముత్తారం తదితర గ్రామాల్లో మిషన్ భగీరథ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని సింగిల్‌విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, అడవిశ్రీరాంపూర్ ఎంపీటీసీ దొడ్డ గీతరాణిబాలాజీ ఆరోపించారు. వాటర్ సక్రమంగా రావడం లేదని, పైప్‌లైన్ అస్తవ్యస్తంగా ఉండడానికి కారణమేంటని ఏఈ ప్రణవ్‌ను ప్రశ్నించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ ఏఈని ఆదేశించారు. మంథని ఆర్టీసీ డిపో నుంచి బస్సును ముత్తారం, ఓడేడ్ నుంచి జమ్మికుంటకు నడపాలని సభ్యులు కోరారు.

మంథని ఎత్తిపోతల పథకం టూటీఎంసీ ప్రాజెక్టు సాగునీరు ముత్తారం మండలానికి అందడం లేదని సభ్యులు ప్రస్తావించారు. ఎల్లంపల్లిలో నీట్టి మట్టం తక్కువ ఉండటంతో సాగునీరు అందడం లేదని ఇరిగేషన్ ఏఈ వివరణ ఇచ్చారు.

గ్రామాల్లో ఇటీవల నిర్మాణం చేపట్టిన సీసీరోడ్లలో నాణ్యత లోపించిందని ఎంపీటీసీ అల్లం తిరుపతి ఆరోపించారు. అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

అధికారులు పారదర్శకంగా పనిచేయాలి

తమకు ఇదే ఆఖరి మండల సభ అని, ఇంతకాలం గ్రామాల అభివృద్ధికి సహకరించిన అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులకు ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, వైస్ ఎంపీపీ సుదాడి రవీందర్‌రావు, ఎంపీటీసీలు దొడ్డ గీతరాణి, బియ్యని శ్యామల, అల్లం తిరుపతి, ఒద్ది తిరుమల, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీదారులకు ఉచిత భోజనం



అన్నదానం ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్ ఆవరణలో సోమవారం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సమకూర్చిన ఉచిత మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, అరుణశ్రీ ప్రారంభించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు ప్రతీ సోమవారం ఉచితంగా భోజనం సమకూర్చేందుకు ముందుకొచ్చిన లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ప్రతినిధులు ఎరబాటి వెంకటేశ్వర్‌రావు, రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్, సాదుల వెంకటేశ్వర్లు, బాలకిషన్‌జాకోటియా, పయ్యావుల కొమురయ్యను కలెక్టర్ అభినందించారు.

టాస్క్ భవన ఆధునీకరణ పనుల పరిశీలన

నిరుద్యోగ విద్యావంతులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ఏర్పాటు చేసిన టాస్క్ భవన ఆధునీకరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పనులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ టాస్క్ మేనేజర్ గంగాప్రసాద్, పీఆర్ ఈఈ గిరీశ్‌బాబు, డీఈఈ శంకరయ్య ఏపీఎం సంపత్ ఉన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం



మాట్లాడుతున్న ధర్మపురి

రామగిరి: సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేస్తామని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి అన్నారు. ఆర్జీ–3 పరిధిలోని ఏఎల్‌పీ గని వద్ద సోమవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కార్మికుల ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, కోల్‌బెల్ట్ ఎమ్మెల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిలో కొత్త అండర్ గ్రౌండ్లు, కొత్తగా రిక్రూట్‌మెంట్ ఉద్యోగాలను పెంచేలా కృషి చేస్తామన్నారు. నాయకులు మందల కొమురయ్య, సాయికృష్ణ, కోలా అనిల్, వెంకటేశ్, హరికృష్ణ, జుబేరు, రంగయ్య, రాయమల్లు, సరేందర్, సంపత్, నారాయణ, శంకర్ పాల్గొన్నారు.

కాళేశ్వరం బ్యారేజ్ పగుళ్లను వెంటనే పూడ్చాలి



వినతిపత్రం అందజేస్తున్న వెంకటరమణ

గోదావరిఖని: గత ప్రభుత్వం కాసులకు కక్కుర్తిపడి కాళేశ్వరం ప్రాజెక్టును నాణ్యత లేకుండా నిర్మించారని బీజేపీ నాయకుడు క్యాతం వెంకటరణ అన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరిపై నాణ్యత లేని ప్రాజెక్టు నిర్మించి రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల, ప్రాజెక్టుల్లో ఆదరా బాదరాగా నిర్మించిన కారణంగా క్యూరింగ్ లేకపోవడం లాంటి అనేక లోపాలతో బీటలు వారి పగుళ్ల బారిన పడిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వర్షాకాలం పూర్తి కాకముందే పగుళ్లను పూడ్చివేస్తామని ప్రగల్భాలు పలికి వర్షాకాలం ప్రారంభమైనా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ ప్రాజెక్టు సందర్శన పరిశీలన అంటూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. బీజేపీ నుంచి చొరవ తీసుకొని సంబంధిత అంశంపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నదీ తీర ప్రాంత ప్రజలతో పాటు రైతులందరికీ సాగునీటి కష్టాలు తీరేలా కృషి చేయాలని కోరారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న పిడమర్తి రవి

మంథని: రాష్ట్రంలో 12శాతం ఉన్న మాదిగలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించేలా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవ చూపాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి కోరారు. మంథని ఫ్రెండ్స్ క్లబ్‌లో సోమవారం మాదిగ జనసభ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలోకి వచ్చినప్పటి నుంచి వర్గీకరణ పేరుతో మాదిగలను మోసం చేస్తోందన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఏబీసీడీ వర్గీకరణలో మాదిగలకు 12శాతం పెంచుతూ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేసారు. మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కపాక సంపత్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, రిటైర్డ్ రేంజ్ ఆఫీసర్ బి.రాజయ్య ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేశ్

మంథని: రామగిరి మండలం నాగెపల్లిలో మల్యాల మణిప్రసాద్ తన నలుగురు స్నేహితులు నలుగురితో కలిసి గంజాయి అమ్ముతుండగా మంథని సీఐ వెంకటేశ్వర్లు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ తెలిపారు. మంథని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం కేసు వివరాలను ఏసీపీ వెల్లడించారు. నాగెపల్లి గ్రామంలో ప్రసాద్ ఇంటికి సమీపంలో కరీంనగర్ జిల్లా మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన బుర్ర వంశీకృష్ణ, పప్పు అనిల్, సిరిసిల్ల శివసాయి మూడున్నర కిలోల గంజాయిని బైక్‌పై అమ్ముతూ ఆదివారం పట్టుబడినట్లు తెలిపారు. వీరి వద్ద గంజాయి, బైక్, సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు వివరించారు. సులభంగా డబ్బు సంపాదించవచ్చని తక్కుధరకు గంజాయి కొని చుట్టుపక్కల గ్రామాల్లో రహస్యంగా అమ్ముతున్నట్లు తెలిపారు. యువత చెడు అలవాట్లకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఏసీపీ సూచించారు.

అనుమతి లేని పాఠశాల సీజ్



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు

గోదావరిఖనిటౌన్: ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్న స్థానిక సప్తగిరి కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్‌ను రామగుండం మండల విద్యాధికారి రాజయ్య సోమవారం సీజ్ చేశారు. అనుమతి లేకుండా పాఠశాల నడుపుతున్నారనే విషయాన్ని ఫోన్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. పాఠశాలలో ఎస్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, ఏఐఎస్ఎఫ్, టీఆర్ఎస్వీ విద్యార్థి సంఘాలు ఆందోళన చేపటడంతో అక్కడికి చేరుకున్న ఎంఈఓ పాఠశాలను సీజ్ చేశారు.

డీఈవో ఆదేశాల మేరకు పాఠశాల సీజ్

అనుమతి లేకుండా నడుపుతున్నారనే సమాచారం ఫోన్ ద్వారా తెలపడంతో అక్కడికి చేరుకొని సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరినట్లు ఎంఈవో రాజయ్య తెలిపారు. ఎలాంటి సమాధానం రాకపోవడం, పర్మిషన్ లెటర్స్ చూపించకపోవడంతో జిల్లా విద్యాధికారికి సమాచారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం డీఈవో ఆదేశాల మేరకు పాఠశాలను సీజ్ చేసినట్లు చెప్పారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ధ్యాన బోధకులు

జ్యోతినగర్: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జ్ఞాన బోధకులు రవిశంకర్‌రెడ్డి, జానాబాయి, సింధూర అన్నారు. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లో తటవర్తి వీరరాఘవరావు దంపతుల మార్గదర్శనంలో రమాదేవి నిర్వహిస్తున్న మూడు రోజుల ఉచిత ధ్యాన ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరంలో సోమవారం వారు మాట్లాడారు. మాంసం తింటే జీర్ణం కావడానికి 72 గంటల సమయం పడుతుందని, శాకాహారం తింటే 4గంటల సమయం పడుతుందని వివరించారు. ధ్యానం చేయడంతో మనిషిలోని 72వేల నాడులు శుద్ధికాబడి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, నిత్యం ధ్యానం చేయాలని అవగాహన కల్పించారు. రమాదేవి, మాధవి, మంజుల, వనిత, రమ, శ్రీదేవి, శకుంతల, రాజమ్మ, పద్మ, మహేశ్వరి, మీనాక్షి, విమల, వసంత పాల్గొన్నారు.

జగిత్యాల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి



కమాన్‌పూర్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మంథని: బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య డిమాండ్ చేశారు. మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మంథని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, కౌన్సిలర్ కాయిత సమ్మయ్య, ఎంపీటీసీ చెరుకుతోట ఓదెలు, నాయకులు జనగామ సంతోష్, లక్ష్మయ్య ఉన్నారు.

జగిత్యాల ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

కమాన్‌పూర్: బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాయకులు బొమ్మగాని అనిల్, తాటికొండ శంకర్, నీలం శ్రీనివాస్, గుర్రం లక్ష్మిమల్లు, పొన్నం రాజేశ్వరి, ఎలబోయిన రామ్మూర్తి, తోట రాజ్‌కుమార్, చొప్పరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజీనామా చేయాలి

ధర్మారం: బీఆర్ఎస్ నుంచి జగిత్యాల ఎమ్మెల్యేగా ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన సంజయ్‌కుమార్ వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, సీనియర్ నాయకులు పుస్కూరి జితేందర్‌రావు మాట్లాడారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, ఎంపీటీసీలు కట్ట తిరుపతి, దాడి సదయ్య, కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, మాజీ ఉపసర్పంచు ఆవుల లత, నాయకులు దేవి వంశీ, ఆవుల శ్రీనివాస్, వేణు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ సందర్శన



భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల మోడల్‌స్కూల్‌ను కాల్వశ్రీరాంపూర్ జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వండుతున్నారా, ఆహారం రుచిగా ఉంటోందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో సోమవారం రాత్రి ఆగి ఉన్న డీసీఎం వ్యాన్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొనడంతో దేవునిపల్లి గ్రామానికి చెందిన గాజుల నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సయ్యను గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ క్రీడాకారులకు సన్మానం

జ్యోతినగర్: వివిధ క్రీడాపోటీల్లో జాతీయస్థాయి పతకాలు సాధించిన క్రీడాకారులను ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీలో ఆదివారం రాత్రి సన్మానించారు. సన్మానం పొందిన వారిలో నవీన, ఆదిత్య, ముక్తిశ్రీ, నాగరాజు, శ్రీవల్లి, లాస్యతోపాటు కోచ్‌లు సురేశ్, శ్రీనివాస్, రాము, శంకర్ ఉన్నారు. క్రీడా కోచ్‌లు, కరాటే మాస్టర్లు వడ్డేపల్లి సురేశ్, కరాటే శ్రీనివాస్, పసునూటి శంకర్, మంథిని నాగరాజు, బోయపోతు రాము, కూసం శ్రీనివాస్, వడ్డెపల్లి నవీణ ఉన్నారు.

అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీలో 467 మార్కులు

సుల్తానాబాద్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న అమరగొండ నవీన్ కుమార్ 467 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొరాజ్ తెలిపారు.

అర్థమయ్యే రీతిలో బోధించండి

మంథని: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సరిపడా పౌష్టికాహారం అందిస్తూ ఆటాపాటలతో అర్థమయ్యేలా బోధన చేయాలని మంథని ఎంపీపీ కొండ శంకర్ అన్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్ నక్క నాగేంద్ర ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ధర్మారం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒకే విడతలో రూ.2లక్షల పంట రుణం మాఫీ చేస్తామని కేబినేట్‌లో తీర్మానించడాన్ని స్వాగతిస్తూ ధర్మారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

మంథని: మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పాఠశాలలో అడ్మిషన్ కోసం ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపీపీ కొండ శంకర్ పోటీలను ప్రారంభించారు. అత్యధిక పాయింట్లు సాధించిన 10మంది విద్యార్థులను 27, 28వ తేదీల్లో జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించనున్నట్లు ఎంఈవో దాసరి లక్ష్మి తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ సీపతి బానయ్య, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, జిల్లా ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్, వ్యాయామ టీచర్లు రవి, మాధురి, సమ్మయ్య, శ్రీనివాస్, సీఆర్పీలు మల్లయ్య, స్వప్న పాల్గొన్నారు.

ముత్తారంలో క్రీడలు ప్రారంభం

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాలలో సోమవారం క్రీడ పాఠశాలలో ప్రవేశాల కోసం ఎంపీ పోటీలను ఇన్‌చార్జి ఎంఈవో దాసరి లక్ష్మి ప్రారంభించారు. ఎంఎన్‌వో ఓదెలు, హెచ్ఎం పద్మావతి, పీఈటీలు సునీత, సయ్యద్ ఖాజాబీ, రజిత తదితరులు పాల్గొన్నారు.

24న క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

కమాన్‌పూర్: 2024–25 విద్యాసంవత్సరానికి గాను క్రీడా పాఠశాలలో నాలుగో తరగతిలో ప్రవేశం కోసం 26న మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి సురేందర్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ తెలిపారు.

26న సుల్తానాబాద్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

సుల్తానాబాద్: 26వ తేదీన క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ క్రీడా పాఠశాలలో 2024–25కి గాను నాలుగో తరగతిలో ప్రవేశానికి అవకాశం ఉందని తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు రేగడి మద్దికుంట పీఈటీ రమేశ్ నంబర్ 9490 674874ను సంప్రదించాలని ఆయన సూచించారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జూలపల్లి: యువత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణతో చదువుకోవాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై శ్రీధర్ సూచించారు. మండలంలోని ఆదర్శ విద్యాలయంలో విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల సాధనపై అవగాహన కల్పించారు. గంజాయి, మద్యం, ధూమపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఏఎస్ఐ భాస్కర్, పీసీలు పవన్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన భవనానికి నిధులు మంజూరు చేయండి



వినతిపత్రం ఇస్తున్న హెచ్ఎం రత్నాకర్‌రెడ్డి

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని హెచ్ఎం రత్నాకర్‌రెడ్డి ఎమ్మెల్యే విజయరమణారావును విన్నవించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన వెంట టీచర్ సారయ్య ఉన్నారు.

వంతెనపై పేరుకుపోయిన మట్టి తొలగింపు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం–కూనారం వంతెనపై పేరుకుపోయిన మట్టిని సోమవారం మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ తొలగించారు. వంతెనపై నీరు నిలచి వంతెన శిథిలమయ్యే ప్రమాదం ఉండటంతో స్పందించిన ఆయన ట్రాక్టర్‌తో మట్టిని తొలగించారు.


నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు



అభినందన పత్రం అందిస్తున్న ప్రతినిధులు

పాలకుర్తి: నేత్రదానంపై అందరూ అపోహలు వీడి అవగాహన పెంచుకోవాలని, మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. పాలకుర్తి మండలం కన్నాల బోడగుట్టపల్లికి చెందిన పోలు శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబసభ్యులు శాంతమ్మ నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా శాంతమ్మ కుటుంబసభ్యులకు అభినందన పత్రం అందజేశారు. లయన్స్‌క్లబ్ కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు భీమనపల్లి పృథ్వీరాజ్, బొడ్డుపల్లి లక్ష్మణ్, బుర్ర సదిగౌడ్, కనుకయ్య, గట్టయ్య, రామచంద్రం పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఎమ్మెల్యే ప్రోత్సాహకం



అభినందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖనిటౌన్: ఇటీవల కర్ణాటకలోని బాగల్‌కోర్టులో జరిగిన ఖేల్ ఇండియా ఉమెన్స్ ఉషూ లీగ్ పోటీల్లో సంశౌ(చైనీస్ బాక్సింగ్) జూనియర్ బాక్సింగ్ 60కేజీల విభాగంలో గోదావరిఖని క్రీడాకారిణి సిగిరి శ్రావ్యాంజలి బంగారు పతకం సాధించింది. కోయంబత్తూర్‌లో జరిగే జాతీయ పోటీలకు వెళ్తున్న సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ రూ.20వేల ప్రోత్సాహకం కార్పొరేటర్ ఖాజా ఫ్రక్రుద్దీన్ ఆధ్వర్యంలో అందజేశారు.